# జరీమసుగం - స్త్రీ

''శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దానవో
ద్రేక స్తంభకు గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనా
డింభకున్.''

తాతయ్య భాగవత పద్యాలను మధురంగా, రాగయుక్తంగా పాడుతూ వివరిస్తూంటే కుతూహలంగా వింటున్న శారద ఇలా అడుగుతూంది: ''ఎప్పుడైనా ఏ యుగంలోనైనా అసలు రాముడు, కృష్ణుడు లాంటి మహా పురుషులు ఉన్నారా! అనిపిస్తుంది, తాతయ్యా!''

''లేకపోవడమేమిటమ్మా — ఇంత రమ్యంగా ఆ దివ్యమూర్తుల లీలలను మన కళ్ళముందు చూస్తున్నంతగా కవులు వర్ణించి చూపుతూంటే?''

''అప్పటి ప్రజలు ఎంతో సుఖంగా, మాత్సర్యమనేది ఎరగక జీవించేవారట. అలాంటి జీవితం ఇప్పుడు ఉంటే, ఆ శ్యామసుందరుడు గోపికలతో ఆడుకున్నట్లే, ఈ తరంలో అవతరిస్తే ఎంత బాగుంటుందో! కదూ, తాతయ్యా?''

''అది అసాధ్యం, తల్లీ! ఆ పరమేశ్వరుడు పాప పంకిలమైన ఈ దేహాలకు దర్శనమివ్వడు, తల్లీ! సాధనతో మన ఆత్మలకు అందుతాడే తప్ప భౌతిక రూపాలకు అతీతుడు.''

''జనోద్ధరణ కోసం అలాంటి వ్యక్తి ఈ లోకంలో పుట్టినా, అంతా అతన్ని విశ్వసించగలరా, తాతయ్యా?''

''ఏమో, తల్లీ? భగవంతుడికంటే ఆయన సృష్టించిన మాయామోహాలే మనిషిని అందంగా బంధించుతున్నాయి. విశ్వమూర్తి వెలుగు కాంతుల కంటే కారుచీకటిలోనే మనిషికి సాంత్వన లభిస్తూంది. ఈ వ్యామోహమే తిరస్కార భావాల నేర్పరిచి మనిషిని బలహీనుడుగా చేస్తూంది.''

'అందుకే, తాతయ్యా, ఈ యుగంలో కూడా అటువంటి మహా వ్యక్తులు పుట్టే ఉన్నారేమో! వారిని ఈ మనిషే గుర్తించలేకపోతున్నాడు' అనుకుంటూ సమాధానపడింది శారద.

''శారదా! ప్రదోషం వేళయినట్లుంది. గుడికి వెళ్ళిరావూ?'' తల్లి కేక విని లోపలికి వెళ్ళింది శారద. శారద బాల వితంతువు. రఘురామయ్యగారి ఒక్కగా నొక్క బిడ్డ జానకి. జానకి, శ్రీరామ్‌ల ఏకైక సంతానం శారద. రోగంతో తీసుకుంటున్న అమ్మమ్మ కోరిక మీదైన శారదకు అయిదవ ఏటనే శాస్త్రోక్తంగా వివాహం జరిగింది. తరవాత మూడేళ్ళు నిండగా యనిపించేసరికే శారద నుదుట కుంకుమ చెరిగిపోయింది. ఆ అఘాతం నుంచి పూర్తిగా తేరుకోక మునుపే శ్రీరామ్ ఒక రోజు ఆబోతుకి ఘోరంగా బలియై పోయాడు. జానకి గుండె అవిసి పోయేలా ఏడ్చింది. అప్పట్నుంచి ఆ ముగ్గురే ఒకరి నొకరు అనునయించుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటు న్నారు.

''తాతయ్యా! వెడుతున్నా. ఈ వేళ ఏకాదశికదూ? నువ్వు కూడా రాకూడదూ?''

''లేదమ్మా. నువ్వు వెళ్ళిరా, తల్లీ! నడుగు లేస్తే ఆయాసం ముంచుకొస్తుంది. గంట కూర్చుంటేనే గానీ అడుగెయ్య లేను'' అన్నా రాయన. బయలుదేరింది శారద. సన్నటి తెల్లని చీర. తెల్లరంగు రవిక. ఈ పాలరాతి బొమ్మను ఏ దేవుడు చూడలేక పోయాడు? చెమర్చిన కళ్ళను ఒత్తుకున్నా రాయన ఉత్తరీయంతో.

ప్రదక్షిణ చేసి లోపలి కడుగు పెట్టిన శారద కొన్ని నిమిషాలు పరమేశ్వరుడి వైపు తదేకంగా చూసింది, చేతులు జోడించి. ప్రతి రోజూ కొత్తగా కనిపిస్తాడెందుకో! లింగాకారంలో ఉన్న నల్లటి రాయి. పైన పడగ ఎత్తి బుసలు కొట్టే ఫణిరాజు. ఆ విగ్రహం చూస్తూ కళ్ళు మూసుకుంది శారద. ప్రమథగణాలతో ప్రళయ తాండవ మాడుతున్న శివుడు. కైలాసపర్వతం కంపించిపోయేలా ఆవేశంతో అతి భీకరంగా నాట్యం చేస్తున్న శంకరుడు. రోషాగ్నిజ్వాలలు నిండిన మండుతున్న కళ్ళతో దిక్పాలురు సైతం వణికిపోయేలా మహోగ్రంగా, ప్రచండ వేగంతో కాలరుద్రుడై దక్షయజ్ఞం విధ్వంసం చేసి వికటంగా హాహాకారం చేస్తూ తాండవ నృత్య మాడుతున్న ఈశ్వరుడు.

మారిపోతున్న దృశ్యాలను మననం చేసుకుంటూంది శారద.

''అక్కా, అక్కా!'' కొంచెం దూరంగా వినిపిస్తున్న స్వరానికి కళ్ళు తెరిచి చూసింది శారద. తరవాత బయటికొస్తూ, ''రాజా! ఎంత సేపయింది వచ్చి?'' అంది ఆప్యాయంగా, ధ్వజస్తంభం పక్కగా నిలబడిన రాజాని చూస్తూ.

''నీ వెనకే వచ్చానక్కా. నువ్వు చాలా సేపటినుంచీ అలాగే నిలబడ్డావు. అందుకని. . .''

''భయంవేసిందా, రాజా? అటు చూడు, ఈశ్వరుడు ఎంత నిర్మలంగా ఉన్నాడో!''

''అవునక్కా. ఎంతటి ప్రసన్నుడు కాకపోతే గరళాన్ని గొంతులో దాచుకో గలడు!''

''అంత కరుణామూర్తి అయినప్పుడు ప్రేతభూముల్లో తిరుగుతాడనీ, కోడె త్రాచుల్ని చుట్టుకుంటాడనీ ఎందు కలా నిందాపూరితంగా దూషిస్తారు, రాజా?''

''అందరిలా అష్టైశ్వర్యాలు కోరుకోక, అతి సామాన్యుడిలా విభూతి రాసుకుని కాటిలో సంచరిస్తాడనే చులకన భావమేమో, అక్కా, అది!'' అంటూ, ''మనం అలా మంటపం దగ్గర కూర్చుందాం. రా'' అన్నాడు రాజా. నడుస్తున్న రాజాతో తనూ కలిసింది శారద.

• • •

రాజా గాలిమనిషి. పుట్టగానే తల్లి తండ్రుల్ని పోగొట్టుకున్నాడు. రోజులో చాలా భాగం శివాలయం అరుగుల మీదే పిచ్చి పిచ్చి బొమ్మలు గీసుకుంటూ కాలక్షేపం చేస్తూ ఉంటాడు. ఆ గ్రామంలో ఎవరు, ఎలాంటి సహాయం కోరినా రాజా కాదనడు. ఏ అమ్మయినా ఇంత పెడితే తినడం, ఆలయం పక్కనే సెలయేరులో ఇన్ని నీళ్ళు తాగడం—అంతే. ఒక్క మాటలో చెప్పాలంటే, రాజా ఆ ఊరికి అయాచితంగా లభించిన ఉమ్మడి సొమ్ము. శారదని ఎక్కువగా అభిమానిస్తాడు రాజా. ఆ చనువే వాళ్ళిద్దరి మధ్యా అక్కా, తమ్ముళ్ళ బంధం. శారద గోడలమీద గీతలు గీస్తున్న రాజాని చూసి, అతని కందులో ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తూ ఉండేది. రాజా పరిచయం శారదకు అడవిమల్లెకు పందిరిలాంటిది. తన ఊహ లాధారంగా పెన్సిలుతో బొమ్మలు గీసి చూపించే వాడు రాజా. చిత్రలేఖనంలో ఏమాత్రం ప్రవేశం లేకపోయినా, ఏవేవో సూచన లిచ్చేది శారద. సంబరపడిపోయేవాడు రాజా.

''రాజా! గౌరీశంకరుల బొమ్మ వెయ్యకూడదూ?''

''ప్రళయతాండవం చేస్తున్నట్లా?'' అడిగాడు రాజా.

''కాదు. ఇద్దర్నీ పక్క పక్కగా, ఇంకెవ్వరూ వాళ్ళకి సాటి లేనట్లుగా, అపురూపంగా, ఎంతో అందంగా, చూడగానే ఆదిదంపతులు ఇంతటి అనురాగమూర్తులా అనిపించేలా, ఎదుట కనిపించేలా. అలా ఉండాలి.''

శారద కంఠం బరువుగా పలికినట్లనిపించింది రాజాకి. 'అక్క మనసులో ఏముంది? ఈ కోరిక దేవదేవుడి మీదనా? మక్కువా? తనలో నలిగిపోతున్న, అణుచుకుంటూన్న ఆనందమా?' సందిగ్ధం కొట్టుమిట్టాడింది.

''ఏం రాజా, సందేహిస్తున్నావా?''

''అదేం కాదక్కా.'' తడబడ్డాడు రాజా.

''పెద్ద పెద్ద చిత్రాలేవీ నే చూడలేదు గానీ, నీ పట్టుదల చూస్తూంటే భవిష్యత్తు ఉన్నతంగా కనిపిస్తుంది నాకు. ఎందుకంటావేమో—మొన్నటి ఆ ప్రకృతి చిత్రం ఇంకా కళ్ళముందు మెదులుతూంది. చింతతోపుల్లోంచి ఉదయిస్తున్న సూర్యబింబం. విడీవిడని మంచు పొగ. కొమ్మలు గుబురుగా పెరిగినా, వాటి మధ్య సందుల్లోంచి ఎంత అందంగా మెరిశాయనీ కిరణాలు! నిజంగా ఆ

అందుకే ఇన్నాళ్ళూ పైకి చెప్పుకోలేక సతమతమై పోతూ కుమిలిపోతున్నాను."

కాస్సేపు ఆగింది శారద. "ఎండిపోతున్న నా ఆశకు మళ్ళీ ప్రాణం పోస్తున్నాయి నువ్వు వేసే బొమ్మలు. నువ్వు కాదన నంటే ఒక్క కోరిక, రాజా!"

"ఏమిటక్కా అది?" ఆత్రంగా అడిగాడు రాజా.

నిమిషంపాటు తటపటాయించి ఏదో చెయ్యరాని పని చేస్తున్నట్లు తడబడు తున్న గొంతును అదుపులోకి తెచ్చు కుంటూ చెప్పింది: "సుమంగళిగా నా ప్రతిరూపాన్ని చిత్రించు, రాజా!"

"అక్కా!" రాజా గుండెల్లో మెలి తలు తిరుగుతూన్న క్షోభ.

"నా స్వార్థానికి మన్నించు, రాజా! ఈ కోరికను ఎంత చంపుకుందామన్నా సాధ్యం కావటం లేదు." చెంపలపై జారుతున్న కన్నీళ్ళను గట్టిగా తుడిచేసు కుంటూ తల పక్కకు తిప్పుకుంది శారద.

'అక్కా! నువ్వు పెట్టిన శిక్ష ఇది.' మనసులోనే అనుకున్నాడు.

"నీ కాగితాల్లో నేను చెప్పినవన్నీ పదిలంగా ఉంచిస్తాను. నే నొక బొమ్మనై నువ్వు గీసే రేఖల్లో ఊపిరి పోసు కుంటాను. నా బొమ్మని నా ప్రాణంతో చూసుకుంటాను తృప్తి నిండిన కళ్ళతో,



"కాదు, రాజా. కొన్నేళ్ళనుంచీ కటిక చీకటి పేరుకుపోయి, ఒక నాడు హఠా త్తుగా సౌదామిని మెరిసినట్లు భానూ దయం అయితే అంత వెలుగును ఆర గించుకోలేక లోకమంతా ఆ సంతోషంలో ఉక్కిరి బిక్కిరై, చైతన్య రహితమై పోతే ఆ ఉదయం విలువెందుకు! సంప్ర దాయం మట్టిలో కలిశాక మనుగడ ఎందుకు? అనుకుంటాడు తాతయ్య. పతంతువైన స్త్రీ నుదుట కుంకుమ చూసిన క్షణం కూతురి సుఖంకోసం ఇది తప్పు, చెయ్యకూడనిది అని చెప్పలేని నిస్సహాయ స్థితిలో కుళ్ళిపోతుంది అమ్మ.

గుండెలు నిండేవరకూ. కానీ, రాజూ, ఆ బొమ్మ కదిలి రాదు కదూ? నిర్జీవంగా ఉంటుం దంతే. పోనీలే రాజూ, అది కాగితం బొమ్మ అయితేనేం? ప్రాణం ఉన్న నా కంటే ఎంతో అందంగా ఉంటుంది. కొత్త కాంతిలో కలక ల్లాడుతూ మురిపించేలా ఉంటుంది. అయినా, దా న్నెవరు చూస్తారు కనక! నా కోసమేగా?" అధికానందంతో ఉన్మాదినిలా మాట్లాడుతూన్న శారద ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు పాలిపోయిన ముఖంతో, అనుమానంగా రాజావైపు చూస్తూ, "న న్నెప్పుడూ నువ్వీ రూపం లోనే చూశావు; చూస్తున్నావు. అదే దృష్టిలో ఉండి నాకు కుంకుమ లేకుండా చెయ్యకేం? మరిచిపోయి అలానే గీస్తే నాకు ఏడుపొస్తుంది" అంటూ దీనంగా అర్థిస్తున్న ఆ కళ్ళను నీటి పొర కమ్మింది. రాజా హృదయం ద్రవించిన ట్లయింది. ఎక్కడో ప్రళయ గర్జన లాంటి అరుపు.

మగత నిద్రలో ఉన్న శారద ఉలికిపడింది. తరవాత వెంటవెంటనే పిడుగులు పడు తున్నట్లు రెండు మూడు రంకెలు. ఆబోతు తమ ఇంటిదాకా వచ్చినట్లుంది. శారద ధైర్యం తెచ్చుకుని కిటికీ తెరి చింది. బయట అంతా నల్లరేగడిలాంటి చీకటి. ఈ చలికి తల ఆనించి కళ్ళు విప్పార్చుకుని చూసింది. చీకటి రాశిపైన వెన్నెల ముద్దలా ఆబోతు నిలబడి ఉంది. దానికున్న అహం అంతా కొమ్ముల చివర వాడిగా ఉన్న మొనల్లోనే ఉన్నట్లుంది. ఒక్కసారి వాటిని విదిలిస్తే మనిషి గుండెల్లోకి సూటిగా దిగిపోయేటంత పదునుగా ఉన్నాయి. అప్పటికీ, ఇప్పటికీ ఒక్కటే తేడా. కృశించిపోయినట్టు ఎముకలు పైకి కనిపిస్తున్నాయి. అంతే. భయంతో శారద చేతులు చల్లబడ్డాయి. కిటికీలు మూసి, బలహీనం ఆవరించి నట్లు కళ్ళు మూసుకుంది.

తను నిద్రావస్థలో రాజాతో చెప్పే సింది. ఎంత చిత్రం! ఎన్నాళ్ళుగానో తపలో నలిగిపోతున్న, చిత్రవధ ననుభవి స్తున్న కోరికను అతి మామూలుగా చెప్పేసింది. కానీ, తనకు తీరని కోరికే అది. స్వప్నంలో తీర్చమని కోరింది కానీ, వాస్తవంలో నోరు విప్పి అడగలేక పోయింది. రాజాకి కూడా సరిగా ఇదే స్వప్నం వస్తే? తను అడగకుండానే చిత్రం గీసి ఇస్తాడా? ఏమో? ఈర్ష్యా సూయలు లేకుండా ఒక్క వ్యక్తి తనను పసుపు కుంకుమలతో చూడాలని కోరు కుంటే తన జన్మ పునీతం అవదూ? అదే ఆలోచనతో తృప్తిగా నిద్రపోయింది శారద.

"తాతయ్యా! నీకు పొద్దుట్నుంచీ ఆయాసంగా ఉంది. ఈ రోజు నేను చదువుతాను. నువ్వు విను" అంది శారద, పీటపైన ఉన్న భాగవతం అందుకుంటూ. "నీ కెందుకమ్మా" అనలేకపోయా రాయన. ఆ అణకువ, నెమ్మదితనం ఎంతమంది కుంటాయి? అంత చిన్న వయసునుంచీ ఎలాంటి సుఖాలకీ ఆరాట పడక విరాగినిలా, జ్ఞానం పెరుగుతున్న కొద్దీ నిర్లిప్తంగా తిరుగుతూ, తన ఆవేదనను పైకి తెలియనివ్వకుండా ఎంతో సౌమ్యంగా, సరళంగా ప్రవర్తించే మనమరాలి ధోరణి ఆయన నమ్మిన ఆచారాల్ని సవాల్ చేస్తున్నట్టుగా అనిపి స్తుం దాయనకి. తను తప్పు చేసినట్లు కుమిలిపోతా రాయన.

"ఏం తాతయ్యా, అమ్మ కూడా వచ్చింది." హెచ్చరించింది శారద.

"అలాగే నమ్మా. చదువు."

"కుంతి ద్వారకానాథుని స్తుతిస్తూ—

'యాదవులందు పాండు సుతులందు నధీశ్వర,
నాకు మోహ వి
చ్ఛేదము సేయుమయ్య, ఘన సింధువు జేరెడి
గంగ భంగి నీ
పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయబుద్ధి న
త్యాదర వృత్తితో గదియునట్లుగ జేయుగదయ్య!
ఈశ్వరా.'

'నాకు యాదవ పాండవుల యందున్న బంధుప్రేమ నశించి, అఖండ ధారావాహిని యగు గంగ సముద్రంలో ప్రవేశించినట్లే నా బుద్ధి నీయందే లగ్నమయేటట్లు అనుగ్రహించు.'"

పదాలు విడదీసి, స్వచ్ఛమైన ఉచ్చా రణతో చకచకా చదువుకుపోతున్న శారదవైపు నిశ్చలంగా చూస్తోంది జానకి. 'ఈ మూర్ఖ నమ్మకాల్ని, సనాతన సంప్రదాయాల్ని ఛేదించుకుని నా తల్లికి నిండుగా ఉండే ముందు బ్రతుకు నెందుకు కల్పించకూడదు? నా కూతురి జీవితం ఇలా వాడిన మోడులా రాలిపోవలసిందేనా? ఏం అనుభవించిందని ఇంతటి శిక్ష విధించాడు భగవంతుడు!' పొంగుతున్న దుఃఖాన్ని మనసులోనే ఆవిరి చేసు కుంటూ లోపలి కెళ్ళిపోయింది జానకి.

"ఏమమ్మా, నేను చదువుతూంటే నీకు అర్థం కావడం లేదా?" అనడిగింది శారద. అప్పుడప్పుడూ శారదకు అల వాటే చదివి వినిపించడం. కానీ, తల్లి మధ్యలోనే లేచి పోవడంతో అనుమానంగా అడిగింది.

"అదేం కాదమ్మా. పాలు తోడు పెట్టడం మరిచిపోయాను. నువ్వు చదు వుతూ ఉండు. నాకు లోపలికైనా వినిపిస్తూనే ఉంటుందిగా?" అం దావిడ. శారద మరేం మాట్లాడలేదు.

• • •

శివాలయం అరుగు చివర కూర్చుని రాజా ఎంతో దీక్షగా, ఏకాగ్రతతో తప స్సమాధిలో మునిగిన మౌనిలా మనసు నంతా కాగితంపై చేతులు తిప్పుతూన్న ఆకారం వైపు లగ్నంచేసి, చెదరని నిశ్చ లతతో చిత్రం గీయడంలో నిమగ్నమై ఉన్నాడు. కఠోర, తీవ్రమైన తపస్సు తరవాత సాధనలో విజయం పొందిన యోగిలా ఎంతో స్థిరంగా ఉం దతని చూపు. చేతివేళ్ళు చురుగ్గా చకచకా పరుగులెడుతున్నాయి కాగితంపైన. ఎంతసేపటికో చూశాడు రాజు ఆలయ ద్వారం వైపు.

"ఏం రాజూ, ఈ రోజు మా ఇంటికే రాలేదు ఒక్కసారైనా?" అప్పుడే గుడికి వస్తూన్న కరణం గారి భార్య ప్రశ్నిం చింది.

"ఏమైనా పనుందాండీ?" విన యంగా అన్నాడు రాజా.

"పెద్ద పని కాదు కానీ, మొన్న అమ్మాయి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. బియ్యం, పప్పులు ఇంకా ఏవేవో కావాలని వ్రాసింది. బండిమీద నువ్వోసారి పట్నం వెళ్ళొస్తావనీ, నిన్ను పంపితే మాకు క్షేమంగా చేరతాయనే నమ్మకం, ధైర్య మూనూ. అసలీ రోజు ఆయనే చెబుతా నన్నారు" అంటూ ఆగింది.

"అలాగే. మీ రెప్పుడు వెళ్ళమంటే అప్పుడే ఇచ్చి వస్తాను" అన్నాడు రాజు.

"ఆబోతు వచ్చిందిట కాదూ? ఏమిటో నాయనా, అది మళ్ళీ ఈ ఊరు వదిలి వెళ్ళిందనే వరకూ ఎవరికీ ప్రాణాలు కుదుటపడవు. చిన్నతనం నుంచీ ఆబోతుల్ని చూస్తున్నాంగానీ, మనుషుల్ని చంపే వాటిని దీన్నే చూశాం. వచ్చినప్పుడల్లా ఒక్కర్నైనా బలి తీసు కోకుండా పోదు — ఎవరికి నిండిందో ఆయుర్దాయం!" అంటూ లోపలి కెళ్ళా రావిడ.

రాజు కాస్సేపు అలాగే నిలబడ్డాడు. కొంతసేపటికి పార్వతి గుడి లోపలినుంచి బొట్టు పెట్టుకుంటూ బయటికొచ్చింది. చిత్రమైన ఊహ మెదులు తూండగానే శారద కనిపించింది, బిందె తీసుకుని వస్తూ.

"పూర్తయినట్టుందే అప్పుడే?" అంది దగ్గరకు వస్తూ.

"సగంలో చూశావంటే పూర్తికా దంతే." కాగితాలు లాక్కుంటూ అన్నాడు రాజు.

"పోనీలే. ఆత్రత నాపుకోలేక అడిగాను. అంతే" అనేసింది శారద చిన్నబుచ్చుకుంటూ.

"నిజం అక్కా, నాలుగు రోజుల్లో పూర్తయిపోతుంది. ముందు నీకే చూపిస్తానుగా?" అంటూ, "ఈ రోజు నువ్వు వచ్చా వెందుకూ నీళ్ళకోసం?" అన్నాడు.

"అమ్మకి గుండెల్లో నొప్పి వచ్చింది. బహుశా నాన్న మరణం గుర్తు వచ్చి ఉంటుంది, ఆబోతు వచ్చిందనేసరికి." ఏటి కెరటాలకేసి చూస్తూ చెప్పింది శారద.

"అవును. ఆ దృశ్యం మరీమరీ జ్ఞప్తి కొస్తుందే తప్ప తప్పించుకోవాలంటే సాధ్యంకానిది. అక్కా, కొన్ని జ్ఞాపకా లెందుకు మనుషుల్ని భయపెడతాయి?"

"భయంకాదు, రాజూ, భ్రమ. ఆ జరిగిపోయిన సంఘటనలను భవిష్యత్తుతో పోల్చుకుంటే అవి మరింత క్రూరంగా కనిపిస్తాయి. దానితో ఒక విధమైన బలహీనత చోటు చేసుకుంటుంది. వాటి నుంచి తప్పించుకోలేక, ఆలోచనల నుంచి బయటపడలేక సతమతమైపోతూ ఉంటారు. సృష్టిలో అన్నీ అశాశ్వతం అయినప్పుడు, ఈ బ్రతుకే ఒక భ్రమ. ఆ భ్రమ తీరేవరకూ భయాలూ, బంధాలూ తప్పవు, రాజూ!"

'నీ జవాబు లెప్పుడూ చిక్కులు పడ్డ దారంలా ఉంటాయి' అనుకుని, "నేను తీసుకురానా నీళ్ళు మీ ఇంటి వరకూ?" అన్నాడు రాజు.

"చేస్తున్న పనంతా చాలలేదా ఏమిటి? నేనుమాత్రం ఏం చెయ్యాలి? అంతగా తోచకపోతే తాతయ్య పురాణం చదువుతున్నాడు విందువుగాని రా." మందలిస్తూ అంది శారద.

"అదేం కాదులే. నేను తెచ్చిన నీళ్ళు మీ ఇంట్లో తాగరు కదూ?"

శారద నెవరో తట్టి లేపినట్లయింది. వెంటనే సంబాళించుకుంటూ చెప్పింది:

“మాకు తాగే ... విషయానికి నువ్వలా నిష్ఠురపడుకోవడం మానెయ్యాలి. నీటిలో నీళ్ళు నువ్వు ముట్టుకు తాగటం లేదా? అవే మేం ... తాగుతున్నాం. నువ్వు తాకినవి మేం తాగం అనుకోవడం పొరపాటు కదూ? కానీ, నీ చేత్తో తెచ్చి ఇవ్వు నాకు. ఇప్పుడే తాగుతాను” అంది రాజు మనసుని గాయపడనివ్వకుండా.

“నీ మాట కాదక్కా నేను చెప్పేది...”

ఇంకా ఏదో అనబోతూన్న రాజును మధ్యలోనే ఆపి, “తాతయ్య పాతకాలం మనిషి. ఆయనకి కొంచెం పట్టింపు ఉంటాయి. వాళ్ళ జీవితాల్ని అలాగే వెళ్ళిపోనివ్వాలి. నిజమే, నువ్వు మంచి నీళ్ళు తెచ్చి ఆయన చేతి కివ్వబోతే తాగరు సరికదా, అపవిత్రమైపోయినట్లు విలవిల్లాడి పోతారు. అది వట్టి చాదస్తం, రాజూ. మనిషి కులంలో ఏముంది చెప్పు— మంచి ప్రవర్తన, సంస్కారం కావాలి కానీ? ఇంకెప్పుడూ ఇలా పిచ్చిగా ఆలోచించకు” అని నచ్చ చెపుతూన్న ధోరణిలో చెప్పింది శారద.

తృప్తిగా అనిపించింది రాజుకి. ‘అక్కా! నువ్వు అతీతురాలివు’ అనుకున్నాడు గుసగుసగా.

• * •

“తాతయ్యా! కులాచారాలు అనేవి ఎందుకు పుట్టాయి?” అడిగింది శారద.

“వంశ ప్రతిష్ఠకోసం. మనిషి ఒక హద్దులో ఉండడంకోసం.”

“ఒక మనిషికి కష్టం కలిగిస్తున్నప్పుడు వదిలేయడంలో తప్పులేదుగా, తాతయ్యా?”

“ఏమిటమ్మా నీ ధోరణి! సంప్రదాయం పాటిస్తే ఆ వ్యక్తి గౌరవం పెరుగుతుందే తప్ప భ్రష్టుడు కాలేడు.”

“అది నిజమే, తాతయ్యా! తక్కువ, ఎక్కువ భేదాలు మనిషిని చిన్న చూపు చూస్తాయి. నువ్వు కులహీనుడివి అని ఎత్తి చూపితే ఆ వ్యక్తి హృదయం గాయపడదూ? ఒకర్ని తక్కువగా చూసే ఆ హద్దులు, ఆచారాలు ఎందుకు, తాతయ్యా?”

“ఎవరి కుల గౌరవం వారిది. ఇందులో తప్పు లెంచడం దేనికమ్మా?” అన్నా రాయన. “ఒకరి ముందు కించపరచ బడ్డాడంటే అది ఆ వ్యక్తిలో ఉన్నంత దోషం.”

“కాదు, తాతయ్యా, అతని వ్యక్తిత్వం అలా దిగజారిపోవడానికి కారణం కులాన్ని హేళన చేయడమే. ఒకరి కింద ఒదిగి ఉంటున్నాడంటే ఆ వ్యక్తిలోని సంస్కారాన్ని ఎగతాళి చేయడమే. మనిషిలో మంచితనాన్నే అవహేళన చేస్తూంటే, అతి ముఖ్యమైన ఆత్మ విశ్వాసాన్నే అడుగడుగునా పతనం గావిస్తూంటే ఆ జీవితం ఎందుకు, తాతయ్యా?” దృఢంగా పలికింది శారద కంఠం.

“ఏమిటమ్మా నువ్వు చెప్పేది! ఏ నాడూ లేనిది వింతగా మాట్లాడుతున్నావు.”

“అదే తాతయ్యా, వీడు కులం తక్కువ వాడు. హీనుడు. వాడు గొప్ప వంశం వాడు; వంశోద్ధారకుడు... ఈ తారతమ్యాలు పోయి అంతా ఒకే కులం అయితే బాగుండదూ? ‘నీ కంటే నే నెక్కువ’ అనుకోవడం కంటే అంతా సమానం అనుకుంటే హాయిగా ఉండదూ?”

“నీకు తెలియదు, తల్లీ! రెండు ముక్కల్లో నీకు తోచింది చెప్పేశావు. కానీ, ఈ హెచ్చు తగ్గులనేవి మనిషి పుట్టుక నుంచీ వచ్చాయి. ఈ నాడు వాటిని వదులుకొని, క్రిందవాళ్ళతో సమానంగా ఉండమంటే కష్టసాధ్యమే అవుతుంది. అంతా ఏకం కావాలని మాటల్లో అనుకోవడమే కానీ, ఎవరూ ఒప్పుకోరమ్మా అనుభవంలో” అన్నా రాయన.

‘అయితే, ఎప్పటికీ ఇంతేనా ఈ భేదాలు.’ తనలోనే అనుకుంది శారద. ‘మనిషి ఎదుగుతున్నకొద్దీ మనసు కుంచించుకుపోతుందా! మానవు డెందుకింత దుర్బలు డవుతాడు!’

• • •

చల్లగాలి వీస్తోంది. ఆకాశంనిండా దట్టంగా అలుముకున్న నల్లటి మబ్బులు మరుక్షణంలో వాన పడుతుందన్నట్లుగా ముసురుకున్నాయి.

“తాతయ్యా! పదేళ్ళ క్రితం ఈ ఆబోతే కదూ నాన్నని చంపేసింది?” అడిగింది శారద.

“అవునమ్మా. విధి అలా రాసి పెట్టింది. జరిగిపోయింది. నిమిత్త మాత్రులం. ఎలా ఆపగలం!” అన్నా రాయన.

“ఎందుకాపలేం, తాతయ్యా? దాన్నలా విచ్చలవిడిగా తిరగనియ్యక ఒక చోట కట్టి పడేస్తే సరి.”

“ఆ సాహసం ఎవరు చేస్తారమ్మా? అయినా, దా న్నెవరూ కట్టగూడదు అచ్చు వేసి వదిలిన తరవాత.”


“మనుషుల ప్రాణాలు తీస్తూంటే అదేం మూర్ఖత్వం, తాతయ్యా! దానికి కావలసినవన్నీ కట్టేశాక వదేయవచ్చుగా?”

“వాడమ్మా! ఎప్పుడో జరిగింది ..., ఇప్పుడూ అలాగే అవుతుం దంటావా? సాధరణంగా సాధు జంతువు అది. పసిపిల్లల్ని కూడా ఆప్యాయంగా ఒళ్ళు నిమురుతుంది.”

‘వెర్రి ముందు మాత్రం ఒకర్ని చంపి దాహం తీర్చుకుని మరీ పోతుంది.’ తాతయ్యతో వాదించి గెలవలేని శారద తనలోనే అనుకుంది. నిజమే, ఒక్కోసారి గుంపు మధ్య నుంచి కూడా అతి నెమ్మదిగా కదిలి వెళ్ళిపోతుంది. దేన్నీ నిర్ధారించుకోలేక అయోమయంగా తిరుగుతూంది శారద.

• • •

గాలి బలంగా వీచడంతో వాన లేని పోయి మబ్బులు తెల్లగా మారుతున్నాయి. మరో గంటకు మాస్తూండగానే చుక్కలు అలుముకున్నాయి. ఆకాశమంతా అందమైన స్త్రీ తలకు చుక్కల చీరపైన జరీ మేలి ముసుగు వేసుకున్నట్లుగా అద్భుతంగా ఉంది. రాజు మనసు కూడా అవధులు దాటిన ఆనందంతో ఉరకలు వేస్తూంది. ‘మరునాడు ఉదయం సూర్యుడు పైకి రాగానే అక్కకి చూపించాలి. ఆ తరవాత పట్నం వెళ్ళాలి. తను కోరిన చిత్రం కాదని కోపం తెచ్చుకుంటుందేమో?’ రాజుకెంతో శాంతిగా, హాయిగా ఉంది. తను పుట్టి, ఇన్నేళ్ళ తరవాత ఘనకార్యం చేసినంత సంతృప్తిగా ఉంది. ఆ నాడు అక్క ప్రోత్సహించి, అభిలాష చూపకపోతే ఈ నాటికీ అలాగే రాళ్ళపైన పెంకులతో బొమ్మలు గీసుకుంటూనే ఉండేవాడు. చిత్రంగా దేవతలా ప్రత్యక్షమైంది అక్క. ఆ ఆప్యాయానురాగాలే లేకపోతే జీవిచ్ఛవానికీ, తనకూ ఏమిటి తేడా? అక్క ఆదరణ తన పేద జీవితానికి ఎంత అమూల్యమైనది! గుండెల మీద చెయ్యి పెట్టుకుని దీక్షగా ఆకాశం వైపు దృష్టి నిలిపాడు రాజు. “కొన్నేళ్ళ క్రిందట ఇక్కడ పుట్టాం మనం. ఇంకా కొన్నేళ్ళ తరవాత చచ్చిపోతాం. జీవిత నాటకంలో ప్రతి వ్యక్తి ఒక సూత్రధారి. బాధలు, బంధాలు, సమస్యలు, ఒడార్పులు, సుఖాలు, కలతలు, ఏడ్పులు, నవ్వులు —అన్నీ ఇందులో పాత్రలే. అన్నీ అనుభవించాక ఎప్పుడో ఒకనాడు నాటకం ముగిసిపోతుంది. మనం లోకం తెరచాటుకు వెళ్ళిపోతాం. వింత ఏమిటంటే మనకు నాటకం అని తెలిసీ, జీవితం అనుకుని మురిసిపోతూ భ్రమపడుతున్నాం. న్యాయం, ధర్మం, అసత్యం,



అవినీతి అనేవి కూడా ఉన్నాయి ఇందులో. అందుకే, రాజా, ఎంతో యుక్తిగా మనం మోసపోకుండా, అన్యాయా లనే రంగుల అల్లికలలో చిక్కుకోకుండా మంచితనంతో, నిజాయితీగా బయట పడాలి. అప్పుడే జీవిత నాటకానికి కో ప్రత్యేకత" అంటుంది అక్క. 'అక్క మనసు స్వచ్ఛమైన పాల మనసు' అనుకున్నాడు రాజా హాయిగా.

బొమ్మ గీసిన కాగితాన్ని అతి జాగ్రత్తగా పట్టుకుని ద్వారం దగ్గరి నుంచే ఆదిశంకరుడికి తలవంచి నమస్కరించాడు రాజా. తరవాత గబగబా మెట్లు దిగి శారద ఇంటి వైపు నడుస్తున్నాడు. కరణం గారి ఇంటిముందు సామాన్లు అవీ బండిమీద ఎక్కిస్తున్నారు కాబోలు — హడావిడిగా ఉంది. తను తొందరగా కాగితం అక్క కిచ్చేసి పట్నం వెళ్ళిపోవాలి. ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తున్నాడు రాజా. కుడివైపు పందు దగ్గర బుసలు వినబడి నెమ్మదిగా తల పక్కకు తిప్పి చూశాడు. కాళ్ళకి సంకెళ్ళు పడినట్లుగా స్తబ్దుడై నిలబడి పోయాడు. అప్రయత్నంగా గుప్పిళ్ళు బిగుసుకున్నాయి కాగితంతో సహా. మొహంలో కఠినత్వం ఆవరించుకుంది. ఆ పసివాడు అంత ఉదయమే బయటి కెలా వచ్చాడో తెలియదు. ఆబోతు తన కొమ్ము పసివాడి పొట్ట కిందకు జరుపుతూ పైకి ఎక్కించుకోవాలని ప్రయత్నిస్తూంది. బిగ్గరగా వినిపిస్తున్న ఏడుపుకి నలుగురూ బయటి కొచ్చారు. అప్పటికే ప్రమాదం గ్రహించిన రాజా ఒక్క పరుగుతో దగ్గరగా వచ్చి పసివాడిని రెండు చేతులతో పైకెత్తి పట్టుకున్నాడు. తన పని కాటంకం కలిగిందనే క్రోధంతో విసురుగా పైకి లేవడంతో కొమ్ము కొన రాజా కంటి కిందుగా లోతుకు చీరుకుపోయింది. పిల్లవాడిని ఎవరో చేతుల్లోంచి లాక్కున్నారు. బాధగా మూలిగి, రక్తం కారుతున్న చెంపను చేత్తో అదిమి పట్టాడు రాజా క్షణం సేపు. పదిమంది కర్రలతో పరుగెత్తు కొచ్చారు. నిలబడి చూస్తున్న ఆడవాళ్ళంతా గాభరాగా తిరుగుతున్నారు. ఉగ్రమూర్తిలా ఉన్న ఆబోతు అంత జనాన్ని చూడ్డంతోటే ఆవేశం వెల్లువికి నట్లు మరింతగా విజృంభించింది. రెండు చేతులూ గుప్పిళ్ళు మూసి ముందుకు జాపుతూ, వెనక్కుతగ్గుతూ పెనుగులాడు తున్నాడు రాజా. కాలి ముష్టెళ్ళి బలంగా అప్పుడంతో ముట్టె అంతెత్తున పైకి ఎగిరి పడుతూంది. చుట్టూ అంత మంది జనం ఉన్నా, రాజాని మాత్రం వదలక వెంటాడుతూంది ఆబోతు. ఎవరికి వారు అతన్ని రక్షించాలనే ప్రయత్నంలో ఆబోతుపైకి కర్రలు విసురుతున్నారు. ప్రాణం కాపాడుకోవాలనే ధ్యాస కంటే, ఇన్నాళ్ళు అపురూపంగా, ఎంతో అందంగా గీసిన చిత్రం తన చేతుల్లో నలిగి చుట్టుకుపోతూందనే బాధ విపరీతమైపోతూంది. ఒడుపుగా పోట్లనుంచి తప్పించుకుంటున్నాడు రాజా. అంత కంటే ఎవరో తప్పిస్తున్నారంటే బాగుంటుంది. క్షణంసేపు అలుపు తీర్చు కుంటున్నట్టుగా నిలబడింది ఆబోతు. శాంతించిందనుకుని దణ్ణాలు పెడుతున్నారందరూ. అదే అదనులో తోక పైకెత్తి ఒక్క ఉదుటున ముందు కురికింది, క్రోధావేశంతో మూర్తీభవించిన ఆబోతు. కుడివైపు గుండెల్లోకి సూటిగా దిగిపోయింది పదునుదేరిన కొమ్ము. ఆ ధాటికి తట్టుకోలేక, బాధను ఓర్చుకోలేని స్థితిలో నేల కొరిగాడు రాజా. తన పని తీరినట్టుగా నెమ్మదిగా, తిన్నగా వెళ్ళిపోయింది నరబలి కోరిన జంతువు. అంతవరకూ దృశ్యం చూస్తున్న పిల్లా పెద్దా చుట్టూ మూగారు గుండెలు బాదుకుంటూ. "పట్నం తీసుకెళితే సరి. ఏమైనా ఆశ ఉందేమో" అన్నా రెవరో. కొంత మంది పెద్దలు బతకడని తేల్చేశారు, పెదవి విరుస్తూ. మూతలు పడుతున్న రాజా కళ్ళు ఎంతో ఆశగా పరికిస్తున్నాయి అందరి వైపూ—అంతకంతకూ కాంతి క్షీణిస్తూంటే కొన ఊపిరితో కొట్టు కుంటూ మాటలకోసం పెదాలు తడుపు కుంటున్నాడు. గట్టిగా పట్టుకున్న పిడికిలి వైపు చూస్తూ, చిరునవ్వు కోసం తడుముకున్నాడు. నరనరాన్నీ పీల్చేసే బాధ. దైన్య స్థితిలో అసహాయుడై కళ్ళు మూసుకున్నాడు రాజా.

గుంపుని తోసుకుంటూ పరుగు పరుగున వచ్చిన శారద రక్తంతో తడిసిన రాజాని శిలా ప్రతిమలా కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది. తన దగ్గరగా ఆత్మీయమైన స్వరం వినిపించటంతో చివరిసారిగా బలవంతంగా కళ్ళు తెరిచాడు రాజా. 'అక్కా!' అన్న అక్షరాలు పెదవుల మధ్యే ఆగి పోయాయి. అతి కష్టం మీద చెయ్యి పైకెత్త బోయాడు. కానీ, వెంటనే నిర్జీవమై, చలన రహితమై సగంలోంచే క్రిందకు వాలిపోయింది. ఏదో చెప్పాలనే తహతహను గుర్తించిన శారద పరిస్థితి ఊహించి నేలమీదకు జారిన కాగితపు ఉండని చేతుల్లోకి తీసుకుంది. "బండి సిద్ధంగావే ఉంది. త్వరగా తీసుకెళితే నయమవుతుందేమో." మళ్ళీ అన్నా రెవరో. రాజా చెయ్యి పట్టుకున్న శారద అమితంగా చలించిపోయి గట్టిగా అరిచింది. గుండెల్ని చీల్చుకుని ధారగా కారుతున్న ఎర్రటి నెత్తురు భూమాత దాహం తీర్చుకుంటున్నట్లు పడీపడకుండా ఇగిరిపోతూంది. అందరి గుండెలూ ఆ పేదవాడి మీద జాలి, సానుభూతితో కరిగిపోతున్నాయి. పిల్లవాడిని రక్షించి నందుకేమో — ఆ తల్లి ఒకటే దీవిస్తూంది. ప్రాణం లేని రాజా వైపు అదే పనిగా తీరనట్టు చూస్తూంది శారద. ఆమె కళ్ళు దుఃఖం మరిచిపోయి నట్లు పేలవంగా, తెల్లగా ఉన్నాయి. రాజా, తను ఎవరి కెవరు! అంతంలేని బాట వైపు ఒంటరిగా, నిస్పృహతో, నిరాశతో, నిర్లిప్తంగా పయనిస్తుంటే పక్కగా జీవితపు వెలుగు నీడల పొదలు వినటానికి తోటి బాటసారిగా తనకు సాయం వచ్చాడు. అంతే. అంతకంటే తనకేమీ కాడు. శారద గుండెలు పొంగుతున్నాయి. నిస్సత్తువగా కూలబడిన శారద నెవరో ఆ చోటు నుంచి తప్పించారు.

ఎంతో సేపటికి శారద చేతులు నలిగిన కాగితాన్ని విప్పాయి. తొట్రుపాటు, భయం, ఆందోళన ఒక్కుమ్మడిగా కంగడంతో పెదవులు వణికాయి. కంపిస్తున్న చేతుల్లో కాగితం అంచులు సాగి, చివరలు సన్నగా చిరిగాయి. అత్యంత మధురంగా వినిపిస్తున్న గానవాహినిలో హఠాత్తుగా రాగాలు జీరవోయాయి. చిరకాలంగా తనని వేధిస్తున్న పిపాస, తన ఏదో హృదయంలో తను కోరిన రీతిగా ముద్ర వేసుకొనే సమయంలో వెర్రికేక పెట్టింది శారద. మరి ఇంక లోకంతో పని లేదామెకు. అచేతనమైన శారద ముఖం తీరని తృష్ణతో అశాంతిగా కమిలిపోయి ఉంది. అలిసిపోయిన భాస్కరుడు పశ్చిమాద్రికి చేరుకున్నాడు. నీరెండలో లోకమంతా అరుణ వర్ణంతో వింతగా మెరుస్తూంది.

ఎప్పటికో తాతగారి చూపుల్లో ఆ నలిగి చిరిగిన కాగితం మళ్ళీ ముడతలు సరిచేసుకుంది. కాగితమంతా రక్తపు మరకలతో చిందరవందరగా ఉంది. ఎంతో అందంగా,నిర్మలంగా, సుమంగళిగా ఉన్న శారద చిత్రం అది. రంగులు కలుపుకలో, రాజా గీసిన రేఖల్లో ప్రాణం పోసుకున్న నిండైన శారదాకృతి. పాదాలకు పారాణి, చేతులకు ఎర్రటి మట్టి గాజులు, తల నిండా అలంకరించిన పూవులు, రెండు కళ్ళకీ కొసల వరకూ దిద్దిన కాటుక. ఆమె తట్టుకోలేక పోయిన దృశ్యం ఒక్కటే. ఆరీ ఆరని చిక్కటి నెత్తురు నుదురంతా దారుణంగా చిమ్ముకుపోయింది. ఆ నెత్తుటి తెర క్రింద గుండ్రంగా అద్దిన కుంకుమ రూపు లేకుండా కలిసిపోయింది. సంధ్యాదేవి బరువుగా చీకటి ముసుగు కప్పుకుంది. ★

